క్లుప్తంగా

సచివాలయం తనిఖీ



సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని 6,7 వార్డు సచివాలయాలను కమిషనర్ కె.అప్పలరాజు బుధవారం తనిఖీ చేశారు. సచివాలయ రికార్డులు, పౌరులకు అందుతున్న సేవలను పరిశీలించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, రెవెన్యూ కలెక్షన్లు, క్లోరినేషన్, అర్బన్ రీసర్వేపై సమీక్ష నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం



యాగం చేస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీపైడితల్లి అమ్మవారి చండీయాగం బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనం గుడిలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు సాయి, వెలువలపల్లి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో యాగం పూర్తిచేశారు. యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షించారు.

104 ఉద్యోగుల వినతి



డిప్యూటీ డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

విజయనగరం ఫోర్ట్: 104 సర్వీస్‌లను గతంలో మాదిరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని 104 ఉద్యోగుల సంఘం నాయకుడు ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఈ మేరకు బుధవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సన్యాసినాయుడు మాట్లాడుతూ.. అరబిందో కంపెనీ చెల్లించాల్సిన 3 నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని, 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీఓ నంబర్ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడు సంవత్సరాలుగా చెల్లించని ఇంక్రిమెంట్లు, ఎరియర్స్ రూపంలో చెల్లించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అర్జున్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు

నెల్లిమర్ల రూరల్: గుంటూరు జిల్లా తెనాలిలో ఇటీవల అండర్–17 విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కొండవెలగాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 49 కేజీల విభాగంలో లక్ష్మీనారాయణ కాంస్య పతకం, 65 కేజీల విభాగంలో లోకేష్ కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం జ్ఞాన శంకర్, పీఈటీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

నూతన కార్యవర్గానికి సన్మానం



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సంఘ సభ్యులు

భోగాపురం: కామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన పోలవరపు ప్రకాశ్‌తో పాటు వైస్ ప్రెసిడెంట్ రాపాక సత్తిబాబు, సెక్రటరీ కదంబ శ్రీరామ్మూర్తి, కోశాధికారి కుప్పిలి నారాయణరావు, వైస్ సెక్రటరీ అమలాపురం బాబురావులను సంఘం సభ్యులు బుధవారం స్థానిక కళ్యాణ మండలంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ప్రకాశ్ మాట్లాడుతూ సంఘ సభ్యులకు ఎల్లవేలలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా సంఘంలో నమోదైన సభ్యులకు ఐదేళ్ల పాటు ఉచితంగా ఇన్సూరెన్స్, అనారోగ్యంతో బాధపడేవారికి సంఘం తరఫున ఆర్థిక సాయం అందించనున్నట్లు చెప్పారు. ఇల్లు లేని నిరుపేదలు ఉంటే వారికి ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. అనంతరం సంఘంలో సభ్యత్వం పొందిన 120 మందికి గుర్తింపు కార్డులను అందజేశారు.

నగరాభివృద్ధిలో.. ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య
- 1వ డివిజన్‌లో క్షేత్రస్థాయి పర్యటన



1వ డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య

విజయనగరం: నగరాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య పిలుపునిచ్చారు. నగరంలోని వివిధ డివిజన్‌లలో క్షేత్రస్థాయి పర్యటనకు బుధవారం ఆయన శ్రీకారం చుట్టారు. ఒకటో డివిజన్‌లో సచివాలయం-1 పరిధిలో పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజల ఇబ్బందులను గుర్తించారు. వాటి పరిష్కారానికి సంబంధించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. డివిజన్ పరిధిలో ఖాళీ స్థలాలకు పన్నులు ఎందుకు వసూలు చేయడం లేదని అడ్మిన్ కార్యదర్శులపై మండిపడ్డారు. ఆక్రమణలను గుర్తించి వాటిని తొలగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రణాళిక కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఫ్లెక్సీలు, పోస్టర్లు ఎక్కడా లేకుండా తక్షణమే తొలగించాలని ఆదేశించారు. అక్కడక్కడ ఉన్న ఆక్రమిత కార్ షెడ్లను గమనించి వాటిని వెంటనే తొలగించాలన్నారు. కొన్నిచోట్ల కాలువలు, రోడ్లు లేకపోవడానికి చూసి వెంటనే వాటి ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రోడ్లపై ఎక్కడా భవన నిర్మాణ వ్యర్థాలు ఉండరాదన్నారు. గుడిసెలలో ఉన్న వారిని చూసి వారికి ప్రభుత్వ ఇల్లు మంజూరుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. ఇదివరకే ఇల్లు మంజూరు అయి ఉంటే ఆక్రమిత స్థలాలలో ఉన్న గుడిసెలు ఖాళీ చేసి ప్రభుత్వం ఇచ్చే ఇళ్లకు వెళ్లే విధంగా చూడాలన్నారు. ప్రతి ఇంటికి సూర్యఘర్ పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కుళాయి పైపులు ద్వారా పంపిణీ అవుతున్న తాగునీటి నాణ్యతను తెలుసుకునేందుకు క్లోరిన్ పరీక్షను జరిపించారు. అయితే సురక్షితమైన నీరు రావడంతో ప్రజలందరూ నిర్భయంగా తాగునీటిని వినియోగించుకోవచ్చని చెప్పారు. జగదాంబ నగర్ పార్కును సందర్శించారు. అక్కడ విద్యుత్ దీపాలు, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. టిఫిన్ దుకాణాల వద్దకు వెళ్లి వారు వినియోగిస్తున్న పాలిథిన్ సంచులను స్వాధీనం చేసుకున్నారు. మరోసారి నిషేధిత ప్లాస్టిక్ సంచులు వినియోగించినట్లయితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. నగరంలో ఇళ్ల ముందు అనధికార కారు షెడ్లు ఉండరాదన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలని సూచించారు. మెరుగైన పౌరసేవలు అందించడమే సచివాలయ వ్యవస్థ ఉద్దేశమని పునరుద్ఘాటించారు. సచివాలయ కార్యదర్శులు ఎంతో బాధ్యతాయుతంగా ఉత్తమ సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, టీపీఆర్ఓ సింహాచలం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ చెరువులో పూడికల తొలగింపు



బ్రాహ్మణ చెరువులో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

విజయనగరం: నగర పరిధిలో ఉన్న చెరువులను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. నగరంలోని పూల్‌బాగ్ కాలనీలో ప్రేమ సమాజం ఎదురుగా ఉన్న బ్రాహ్మణ చెరువును బుధవారం ఆనయ పరిశీలించారు. చెరువులో చెత్తాచెదారం చేరడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. వెంటనే చెరువులోని వ్యర్థాలను తొలగించాలని ప్రజారోగ్య సిబ్బందికి ఆదేశించారు. దీంతో పారిశుద్ధ్య పర్యవేక్షకుడు బాలకృష్ణ నేతృత్వంలో సిబ్బంది జేసీబీ సాయంతో చెరువులో ఉన్న చెత్తాచెదారాలను యుద్ధప్రాతిపదికన తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మానవ మనుగడకు చెరువులు ఎంతో దోహదం చేస్తాయన్నారు. అలాంటి చెరువులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. చెరువుల్లో చెత్తను వేయొద్దని నగరవాసులను కోరారు.

సెంచూరియన్‌లో రేడియాలజీ దినోత్సవం



మాట్లాడుతున్న వీసీ పీకే మహంతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో ప్రపంచ రేడియాలజీ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ పీకే మహంతి మాట్లాడుతూ రేడియాలజీ కోర్సుకు ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందని, దేశ విదేశాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వివిధ ఆస్పత్రుల ప్రతినిధులు, వర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



పోలిపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న సభ్యులు

భోగాపురం: మండలంలోని పోలిపల్లి, సవరవిల్లి, లింగాలవలస, చెరుకుపల్లి గ్రామాల్లో ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక విజయగనరం కమిటీ ఆధ్వర్యంలో బుధవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు వి.శంకరరావు మాట్లాడుతూ.. కార్తీకమాసంలో దీపాలు వెలిగించడంతో పాటు అందులోని జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రమిదలో వేసే రెండు వత్తులు జీవాత్మ ఆత్మల కలయికకు గుర్తుని, వత్తులు వెలిగించేటప్పుడు వచ్చే నిప్పు జ్ఞానానికి గుర్తుని, గురువు ఇచ్చిన జ్ఞానాన్ని ఆరిపోకుండా వెలిగేలా ఉండాలి అంటే జీవుడు ఆత్మతో యోగం అవ్వాలన్నారు. యోగ సాధన వలన యోగాగ్నిలో కర్మ కాలిపోతే జీవాత్మ మోక్షం పొందుతుందన్నారు. మనిషి తలలో కర్మ అనే నూనె అయిపోతే ఇక జీవుడు ఆ శరీరం విడిచిపెట్టి వెళ్లిపోవాల్సిందేనన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రసాద్, నాయుడు, వంశీ, చరణ్ తేజ్, రాజప్పుడు, శ్రీను, సూరిబాబు, రాజేష్, లోకేష్, భానుమతి, ప్రమీన, జయలక్ష్మి, శిరీష, లత, త్రివేణి, కృష్ణవేణి, మీన, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు మదర్‌థెరీసా సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న చంద్రశేఖరరావు

విజయనగరం అర్బన్: విశాఖపట్నం మదర్‌థెరీసా సంస్థ అందించే గురుబ్రహ్మ-2024 రాష్ట్రస్థాయి అవార్డుకు మహారాజా అటానమస్ కళాశాల రసాయనశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్, జిల్లా జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి(డీపీఓ) గురుబిల్లి చంద్రశేఖరరావు ఎంపికయ్యారు. విశాఖలో సంస్థ ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో చంద్రశేఖర్ ఈ అవార్డు అందుకున్నట్లు బుధవారం ఆయన తెలిపారు. 16 సంవత్సరాలుగా మహారాజా కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు బోధనతో పాటు ఎన్ఎస్ఎస్ ద్వారా అందిస్తున్న సేవలను గుర్తించి మదర్ థెరీసా సంస్థ తనకు ఈ అవార్డు అందించినట్లు తెలిపారు. చంద్రశేఖర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు, సహాధ్యాపకులు అభినందించారు.

పైడితల్లి అమ్మవారి జీవితచరిత్ర పుస్తకావిష్కరణ



పైడితల్లి అమ్మవారి జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ చేస్తున్న సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తదితరులు

విజయనగరం టౌన్: సిరుల తల్లి పైడితల్లి అమ్మవారి జీవిత చరిత్రతో పాటు అమ్మవారి ఖడ్గమాల, శరణుఘోష, లలితా, వీరహనుమాన్, లక్ష్మీదేవి, పైడిమాంబ అష్టోత్తర శతనామావళితో కూడిన పుస్తకాన్ని బుధవారం ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. సిరిమాను అధిరోహకులు బంటుపల్లి వెంకటరావు చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించి భక్తులందరికీ ఉచితంగా అందజేసినట్లు పైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకులు ఆర్.సూర్యపాత్రో తెలిపారు.

కార్యక్రమంలో ఉత్తరాంధ్రా భవానీ పీఠం గురుస్వామి మల్లేశ్వరరావు, సూర్యారావు, బంగారప్పడు, గోవింద, దేవస్థానం విశ్రాంత ఈఓ ఎం.అప్పలనాయుడు, వేదపండితులు అచ్యుత నాగేంద్రశర్మ, ఏడిద వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

భోగాపురం: మండలంలోని ప్రజలకు పరిశుద్ధమైన తాగునీరు అందించాలని, డయేరియా నిర్మూలనకు తక్షణమే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ మధ్య కాలంలో నియోజకవర్గంలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని వివిధ గ్రామాల్లో చాలా మంది ప్రజలు డయేరియా బారిన పడుతున్నారన్నారు. గ్రామాల్లోని వాటర్ ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేసి ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలన్నారు. మురుగుకాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లాలని సూచించారు. ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత ఎంపీపీ ఆహ్వానం మేరకు తొలిసారి మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్నందున వచ్చే సమావేశంలో మండలంలో ఉన్న సమస్యలు గురించి చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్రంలో మహిళలపై హత్యాచారాలు, హత్యలు, దాడులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మండలస్థాయి అధికారులు ఒక టీమ్‌ను ఏర్పాటు చేసుకుని 'సఖి' కార్యక్రమం ద్వారా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులపై మహిళలను అప్రమత్తం చేయడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని ఎంఈఓ రమణమూర్తి, సీడీపీఓ ఎస్తేరు రాణి, ఈఓపీఆర్డీ గాయిత్రిని ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కామేశ్వరరావు 2024–25కు సంబంధించిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం ఎటువంటి తీర్మానాలు చేయకుండానే ఎంపీపీ అనూషరెడ్డి సభను ముగించారు. ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన కర్రోతు బంగార్రాజును ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి, వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పడాల సత్యవతి, దంతులూరి రావాడబాబు, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ కిషోర్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల పదోన్నతుల్లో నిబంధనలు పాటించాలి

- యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్

విజయనగరం అర్బన్: మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో నిబంధనలు పాటించాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.ఆర్.వి.పట్నాయక్, జె.ఎ.వి.ఆర్.కె.ఈశ్వరరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్కూల్ అసిస్టెంట్లు అన్ని సబ్జెక్టులలోనూ మొత్తం పోస్టుల్లో 70% పదోన్నతులకు, 30% ప్రత్యక్ష నియామకాలకు కేటాయించాల్సి ఉండగా.. ఉమ్మడి విజయనగరం జిల్లాలో అందుకు విరుద్ధంగా పదోన్నతులు చేపడుతున్నారని ఆరోపించారు. ప్రత్యక్ష నియామకాలకు ఎక్కువ పోస్టులు చూపుతూ, ప్రస్తుతం సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తున్నారని, ఈ విధానాన్ని మానుకోకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఏ తెలుగు 6 ఖాళీలు ఉండగా 2 మాత్రమే పదోన్నతులకు కేటాయించారు. ఇంగ్లిష్‌లో 4 ఖాళీలకు గాను 1 మాత్రమే పదోన్నతులకు కేటాయించారు. అంతే కాకుండా ఇంగ్లిష్‌కు సంబంధించి సీనియారిటీ జాబితా కూడా ఇవ్వలేదు. తెలుగు, సోషల్ సబ్జెక్టులకు మాత్రమే సీనియారిటీ జాబితాలు ఇచ్చి అభ్యంతరాలు స్వీకరించారు. కానీ ఇంకా తుది జాబితాలు విడుదల చేయలేదన్నారు. తక్షణమే నిబంధనలకు అనుగుణంగా ఖాళీల వివరాలు సరిచేసి సీనియరిటీ జాబితా విడుదల చేసి షెడ్యూలు ప్రకారం పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

డిసెంబరు 8న భగవద్గీత పోటీలు



భగవద్గీత పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్యామ్‌సుందర్, తదితరులు

విజయనగరం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి విజయనగరం జిల్లాశాఖ ఆధ్వర్యంలో డిసెంబరు 8న టీటీడీ కళ్యాణ మండపం ఆవరణలో భగవద్గీత పఠన పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ ప్రోగ్రామింగ్ అధికారి జె.శ్యామ్‌సుందర్ తెలిపారు. పోటీలకు సంబంధించిన కరపత్రాలను స్థానిక కళ్యాణ మండపం వద్ద బుధవారం ఆవిష్కరించారు. 6,7,8,9 తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. 6వ అధ్యాయం ఆత్మసంయమ యోగం, ధ్యానయోగంపై పోటీలు ఉంటాయన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో డిసెంబర్ 7న మధ్యాహ్నం 2 గంటలకు కొమరాడ మండలం కోటిపాంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు పీవీవీ నరసింహాచార్యులు, జి.తిరుపతిరావు, రాజు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు



డెంకాడ పెట్రోల్ బంక్ సమీపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్ద ఎస్ఐ

విజయనగరం అర్బన్: మాదకద్రవ్యాల వినియోగం యువశక్తిని నిర్వీర్యం చేస్తుందని టూటౌన్ పోలీస్ స్టేషన్ సీఐ టి.శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'సంకల్పం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను సీఐ విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఎడ్యుకేషన్, కెరియర్‌పై దృష్టిసారించాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం సీఐని ఘనంగా సత్కరించింది. కార్యక్రమాలు కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, హెచ్ఓడీ డాక్టర్ శ్రీలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

డెంకాడ: డ్రగ్స్ జోలికి వెళ్తే జీవితం నాశనమవుతుందని, అందువలన ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో మండలంలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మత్తు జీవితాన్ని చిత్తు చేస్తుంది. ఆరోగ్యాన్ని పాడుచేస్తుంది. కుటుంబాలను వీధిన పడేస్తుంది. మిమ్మల్ని నమ్ముకున్న వారికి విషాదాన్ని, దుఃఖాన్ని మిగులుస్తుందని అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు



విజయనగరం రూరల్: ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



డెంకాడ: ధాన్యం సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో భవాని

డెంకాడ: రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరించాలని ఎంపీడీవో భవాని, మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి బుధవారం శిక్షణ ఇచ్చారు. రైతులు తమ పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం సేకరణపై రైతులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. సాధారణ రకం ధాన్యం క్వింటా(100 కేజీలు)కు ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.2300, ఎ-రకం ధాన్యానికి రూ.2320 మద్దతు ధరగా నిర్ణయించిందన్నారు.

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం

విజయనగరం రూరల్: మండలంలో ఈ నెల మూడో వారం నుంచి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుందని, అందుకు సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని ఏఓ హర్ష, సివిల్ సప్లై సాంకేతిక సహాయకులు సీహెచ్ హస్మిత, కె.అఖిల అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీహోంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది మండలంలో 8,585 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, నాలుగు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కేంద్రాలలో రైతుల నుంచి ధాన్యం ఎలా సేకరించాలో వారికి ఎలా సహాయపడాలో పూర్తిస్థాయి అవగాహన వారికి కల్పించారు. కార్యక్రమంలో టీసీఎస్ ఆనంద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓ పాపినాయుడు

పూసపాటిరేగ: విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని దివ్యాంగ విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈఓ బి.పాపినాయుడు కోరారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం ఫిజియోథెరపీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ బుధవారం భవిత కేంద్రంలో ఉచితంగా ఫిజియోథెరపీ అందిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని 18 ఏళ్లలోపు దివ్యాంగ పిల్లలు ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.నీలిమ, సహితవిద్య ఉపాధ్యాయులు ఎ.బంగారునాయుడు, ఎం.వెంకటేశ్వరరావు, ఫిజియోథెరపిస్ట్ హిమబిందు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.